ప్రజల హృదయాల్లోనే లౌకికవాదం

- రాష్ట్రంలోనూ విస్తరిస్తున్న మతోన్మాద విష సంస్కృతి
- విద్వేష ప్రచారాలను ఎండగట్టాలి : ఆర్టీఐ జాతీయ మాజీ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్

నవతెలంగాణ-భువనగిరిఅర్బన్

రాజ్యాంగంలోని లౌకికవాదం అనే పదాన్ని తీసి వేస్తే పోయేది కాదని, ప్రజల హృదయాల్లో ఉందని ఆర్టీఐ జాతీయ మాజీ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీసాయి శ్రీనివాస్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 10, 11వ తేదీల్లో జరుగుతున్న ఆవాజ్ రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతుల సందర్భంగా 'రాజ్యాంగ హక్కులు-లౌకికవాదం ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై సదస్సును ఆహ్వానసంఘం అధ్యక్షులు మీరాచౌదరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. బీజేపీ పాలిత ప్రాంతాల్లో మైనార్టీలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని, అందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సైతం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. మతోన్మాద విష సంస్కృతి క్రమక్రమంగా రాష్ట్రంలోనూ విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద శక్తులు తెలంగాణ ప్రజల మనస్సును కలుషితం చేస్తూ విద్వేషబీజాలు నాటుతున్నాయని విమర్శించారు. వందల ఏండ్లుగా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి బతుకుతున్న ప్రజల మధ్య విభజన గీతలు గీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద సంస్థలు సృష్టించిన అపోహలు, అపార్థాలను దూరం చేయాలని, మైనార్టీలపై జరుగుతున్న విద్వేష ప్రచారాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని, మతసామరస్య విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకై పోరాటాలు చేయాలని చెప్పారు. డాక్టర్ మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలపై దాడులు చేయిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో తన కూటమికి ఎన్నికల్లో సరిపోయే సీట్లు వస్తే దేశ రాజ్యాంగాన్ని మార్చడానికి సిద్ధపడ్డారని విమర్శించారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేటట్టు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఇది సెక్యులరిజం విజయమన్నారు. అంతకు ముందు శిక్షణా తరగతుల ప్రారంభ సూచికగా ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ మహ్మద్‌అన్సారి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖ న్యాయవాది ఎంఏ రహీం, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జహంగీర్, సయ్యద్‌హాషం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంఏ ఇక్బాల్, మీర్ ఖాజాహలీ, గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.లతీఫ్ నాయకులు ఇమామ్‌పాషా, యూసుఫ్ అలీ, ముక్తార్ హుస్సేన్, షేక్ అమిత్ భాష,ఎండి పాషా, ఉమర్ అబ్దుల్ రెహమాన్, మహ్మత్ సాజిద్ పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యాలయం మాజీ కార్యదర్శి రామచంద్రరావు మృతి

- సురవరం, కూనంనేని సహా పలువురి నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ మాజీ కార్యదర్శి, కోశాధికారి ధూళిపాల సీతారామచంద్రరావు (డీఎస్ రామచంద్రరావు (89)) శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న సీఆర్ ఫౌండేషన్‌లో మరణించారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో 1935లో ఆయన జన్మించారు. ఆయనకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు నారాయణ లండన్‌లో స్థిరపడగా, రెండో కుమారుడు చింతామణి హైదరాబాద్‌లో, మూడో కుమారుడు రవి ఢిల్లీలో ఉన్నారు. రామచంద్రరావు 1964లో సీపీఐ ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరించి 2023 వరకు దాదాపు 60 ఏండ్ల పాటు సమర్థవంతంగా పని చేశారు. సీపీఐ అగ్ర నేతలు నీలం రాజశేఖర్, చంద్ర రాజేశ్వరరావు, తమ్మారెడ్డి సత్యనారాయణ, నల్లమల గిరిప్రసాద్, దాసరి నాగభూషణం, సురవరం సుధాకర్‌రెడ్డి, కె నారాయణ, చాడ వెంకటరెడ్డి హయాంలో రామచంద్రరావు పార్టీ ఆఫీస్ కార్యదర్శిగా, కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ప్రతినిత్యం నాయకుల కన్నా ముందే కార్యాలయానికి వచ్చి అన్ని దినపత్రికలను చదివి అందులో ముఖ్యమైన వార్తలను కార్యదర్శులకు వివరించేవారు.

సీపీఐ నేతలు, ప్రముఖుల ఘననివాళి

మానవత్వం మూర్తీభవించిన గొప్ప మనిషి రామచంద్రరావు అని సీపీఐ నాయకులు, ప్రముఖులు కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. రామచంద్రరావు కమ్యూనిస్టు పార్టీ శాసనసభా పక్ష పార్టీ కార్యదర్శిగా, తర్వాత పార్టీ కార్యాలయ కార్యదర్శిగా ఆరు దశాబ్దాలపాటు సుదీర్ఘ కాలం నిబద్ధతతో సేవలందించారని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి కొనియాడారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ వద్ద ఉన్న రామచంద్రరావు భౌతిక కాయాన్ని సందర్శించి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి, భారత మాజీ రాయబారి టి సురేష్ బాబు, ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు బివి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పిజె చంద్రశేఖరరావు, సీఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు అజయ్ కుమార్, డిఎస్ కుమార్, ప్రతిభ, కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ కె రజిని నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రుల సందర్శనార్థం రామచంద్రరావు భౌతికకాయాన్ని హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు తరలించారు. చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డితోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, ఎన్ బాలమల్లేష్, ఈటి నరసింహా, పార్టీ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి పార్టీ పతాకాన్ని రామచంద్రరావు భౌతికకాయంపై కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పార్థివ దేహాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించారు.

నారాయణ సంతాపం

రామచంద్రరావు మరణం పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ సంతాపం తెలిపారు. కేరళలోని వాయనాడ్ వరద బాధితులకు సహాయక చర్యల కార్యక్రమంలో ఉన్న తాను రామచంద్రరావు పార్థివ దేహాన్ని చివరిసారిగా చూడలేక పోతున్నందుకు ఎంతో బాధగా ఉందని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణ

- సీఎం రేవంత్‌రెడ్డి బృందానికి ఆ సంస్థ ప్రతినిధుల లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణకు మోనార్క్ ట్రాక్టర్స్ సంస్థ ఆమోదం తెలిపింది. దానిలో భాగంగా ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉన్న తమ పరిశోధన-అభివృద్ధి సంస్థను విస్తరించే ప్రణాళికలపై సంస్థ ప్రతినిధులు అమెరికాలో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైటెక్, పర్యావరణ అనుకూల కంపెనీలను తాము తెలంగాణకు ఆహ్వానిస్తున్నామనీ, దానిలో భాగంగా మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణకు ప్రాధాన్యత ఇస్తామని సీఎం తెలిపారు. స్వయంప్రతిపత్తి, ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికతలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపామన్నారు. ఈ సందర్భంగా మోనార్క్ ట్రాక్టర్స్ సీఈఓ ప్రవీణ్ పెన్మెత్స మాట్లాడుతూ హైదరాబాద్‌లోని తమ ఆర్ అండ్ డీ కేంద్రం అధునాతన డ్రైవర్-ఆప్షన్ స్మార్ట్ ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌లను రూపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రపంచంలోనే తొలిసారిగా డ్రైవర్ తోనూ, డ్రైవర్ లేకుండానూ నడిచే స్మార్ట్ ఎలక్ట్రిక్ ట్రాక్టర్లతో మోనార్క్ ట్రాక్టర్స్ సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నదని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో చర్చలు ఫలప్రదమయ్యాయని చెప్పారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యం

- హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ప్రహరీలు, కంచెలు
- 'జియోమ్యాపింగ్‌కు ప్రయత్నాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు ఆ శాఖ ఉన్నతాధికారులు నడుం బిగించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాలు కలిగి ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డు భూములు పెద్దఎత్తున కబ్జాకు గురి కాగా మరికొన్ని కోర్టుల్లో వివాదాల్లో నలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఎటువంటి వివాదం లేకుండా కబ్జాకు గురికాని భూములను పరిరక్షించాలన్న అధికారుల ప్రతిపాదనకు సర్కారు ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు అందుకు అవసరమైన నిధులను సైతం కేటాయించింది. ఆ మేరకు ఉన్నతాధికారులు సంబంధిత భూములను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్(దిల్) సంస్థల ఆధీనంలో ఉన్న భూములపై సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. హౌసింగ్ బోర్డు ఆధీనంలో ఉన్న భూములు ఆక్రమణలు, కబ్జాలకు గురికాకుండా ఆ భూముల చుట్టూ కంచెలు నిర్మించనుంది. అలాగే జియో గ్రాఫికల్ మ్యాపింగ్ చేయాలని భావిస్తున్నది.ఈ విషయంలో ఇంతకుముందే అధికారులు ఒక రిపోర్టును ప్రభుత్వానికి పంపగా, అందుకు అవసరమైన నిధులను ఇటీవల ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో హౌసింగ్ బోర్డు, దిల్ పరిధిలో ఉన్న భూముల చుట్టూ ప్రహరీలు నిర్మించనున్నారు. జియోగ్రాఫికల్ మ్యాపింగ్ సాంకేతికతతో కూడుకున్న అంశం కావడంతో సంబంధిత కంపెనీతో ఒప్పందం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

'హౌసింగ్' భూముల అసలు కథేంటీ?

రాష్ట్రంలోని నగర కేంద్రాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధర(అఫర్డబుల్ ప్రైస్)కే ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వం ఈ హౌసింగ్ బోర్డును ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయితే, హైదరాబాద్ స్టేట్‌గా ఉన్నప్పుడే ఏడవ అసఫ్ జా గా పేరొందిన మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ దీన్ని 'సిటీ ఇంప్రూమెంట్ బోర్డు'గా ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1960వ దశకంలో దీన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ హౌసింగ్ బోర్డుగా మార్చారు. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ తదితర తెలంగాణ జిల్లాల్లోని భూములు తెలంగాణ హౌసింగ్ బోర్డుకు కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర పరిధిలోని పట్టణ ప్రాంత మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకే అనువైన ఇండ్లను నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం హౌసింగ్ బోర్డు పరిధిలో 5,045 ఎకరాలు, దిల్ కింద 1,800 ఎకరాలను సేకరించింది. హౌసింగ్ బోర్డు కింద మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డితోపాటు నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇండ్ల నిర్మాణాల కోసం 4,230 ఎకరాలను వినియోగించారు. దాదాపు 124 ఎకరాల మేర న్యాయ సంబంధిత అంశాల్లో (లిటిగేషన్), కబ్జా వివాదాల్లో చిక్కుకున్నాయి.

మరో 691 ఎకరాల భూమి మాత్రమే హౌసింగ్ బోర్డు పరిధిలో ఉంది. మరోవైపు దిల్ పరిధిలోనూ 900-1000 ఎకరాల వరకు పలు వివాదాల్లో ఉన్నట్టు తెలిసింది. అంటే 800 ఎకరాలు మాత్రమే వివాదాలు లేని భూమి ఉంది. ఏపీ, తెలంగాణ విభజన తరువాత ఈ భూముల పంపకాల్లో వివాదాలు తలెత్తడంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం వీటిని షెడ్యూల్ 9 లో చేర్చింది.

రాష్ట్రాలు విడిపోయి పదేండ్లవుతున్నా ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు. అయితే, హౌసింగ్, దిల్ భూములు కబ్జాల బారిన పడకుండా కాపాడుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కత నిశ్చయంతో ఉందని ఆర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు. హౌసింగ్ బోర్డు భూములు హైదరాబాద్‌లో 84 శాతం, జిల్లా కేంద్రాల్లో 26 శాతం ఉన్నట్టు అంచనా.

రెండు విడతలుగా చర్యలు

హౌసింగ్ బోర్డు భూములను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం రెండు విడతలుగా చర్యలు చేపట్టనున్నది. తొలి విడతగా ఇదివరకే పనులు నిర్వహించేందుకు పది రోజుల క్రితమే టెండర్లను పిలిచింది. రెండో విడతకూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాటికీ ఇటీవల టెండర్లను ఆహ్వానించారు. మొత్తం 17 ప్రాంతాల్లో ప్రహరీలు, కంచెలు నిర్మించనున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయ్యే సరికి ఏడాదిన్నర కాలం పడుతుందని ఆర్ అండ్ బీ శాఖ పేరు రాయడానికి ఇష్టపడని ఒక ఉన్నతాధికారి చెప్పారు. వీలైనంత తొందరగా నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిసింది. కోర్టుల్లో వివాదాలున్న భూములకు మాత్రం తాము కంచె వేయలేమనీ, కబ్జాకు గురైన వాటిని తిరిగి పొందేందుకు న్యాయ పరంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ఘనంగా టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

- రాష్ట్ర వ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు

నవతెలంగాణ -విలేకరులు

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘకాలంగా అలుపెరగని పోరాటాలు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. 50ఏండ్ల సుదీర్ఘ ప్రస్థానం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంఘం వేడుకలు జరిగాయి. నేతలు జెండాలు ఆవిష్కరించారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనం వద్ద జిల్లా అధ్యక్షులు స్వామి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను ఏకం చేస్తూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భావం జరిగిందన్నారు.

50 ఏండ్ల ప్రస్థానంలో విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా జెండా ఆవిష్కరించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని టీస్‌యూటీఎఫ్ సంఘ భవనంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతి కుమారి హాజరయ్యారు.సంగారెడ్డి పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయ ప్రాంగణంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా.. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, సీపీఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి జెండాను ఆవిష్కరించారు.ఉద్యమాల సారథి.. ఉపాధ్యాయుల పెన్నిధి యూటీఎఫ్ అని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా యూటీఎఫ్ వ్యవస్థాపక నాయకులు ఆర్.రాంరెడ్డి, కె.రామదాస్ అన్నారు. కార్యాలయంలో పతాకాన్ని ఆర్.రాంరెడ్డి ఎగరవేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ పతాకావిష్కరణ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పూర్వ కోశాధికారి యం.లక్ష్మయ్య ఎగురవేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కార్యాలయంలో సీనియర్ నాయకులు రామన్‌గౌడ్ జెండాను ఆవిష్కరించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ సీనియర్ నాయకురాలు, జిల్లా కార్యదర్శి ఎస్.నీలమ్మ పతాక ఆవిష్కరణ చేశారు.

50 ఏండ్ల ప్రస్థానం.. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర సమరం

ఇల్లు పాయె...గుడిసె పాయె

కేసీఆర్ నిర్వాకంపై మంత్రి పొంగులేటి ఎద్దేవా

- త్వరలో అధికారులు మాజీ సీఎం సొంతూరిలో పర్యటిస్తారు
- పేదల ఇండ్లను పూర్తి చేస్తాం
- చింతమడక బాధితులకు మంత్రి హామీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్‌ను నమ్ముకున్న సొంతూరి పేదలకు ఇల్లు రాకపాయె...గుడిసె రాకపాయె అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. చింతమడక గ్రామంలో అధికారులు పర్యటిస్తారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో చింతమడక గ్రామానికి చెందిన కొంత మంది బాధితులు తాము ఎదుర్కొంటున్న ఇండ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆ గ్రామంలో త్వరలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 'ఎనకట ఒకడు ఉన్న ఇల్లు పీకి పందిరి వేసినట్టు'గా చింతమడకలో మాజీ సీఎం కేసీఆర్ పనితనముందని విమర్శించారు. తన పుట్టినిల్లు అయిన చింతమడక గ్రామంలో సీఎం హోదాలో ఐదేండ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తానంటూ పేదోళ్ల ఇండ్లన్నీ కూల్చి వేశారని గుర్తు చేశారు. ఇప్పటివరకు వారికి నిలువ నీడ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి మార్గనిర్దేశం చేస్తానంటూ ప్రగల్భాలు పలికిన ఆయన ఉన్న ఊరోళ్లనే పట్టించుకోలేదని విమర్శించారు. 'చింతమడకలో ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తానని 22 జులై 2019లో ఆర్భాటంగా ప్రకటించారు. ఆయన చేసిన ప్రకటనను నమ్మి తమ ఇండ్లను, గుడిసెలను అక్కడి నిరుపేదలు సర్కారుకు అప్పగించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం వాటిని కూల్చి వేశారు. కేసీఆర్ హామీమేరకు లబ్దిదారులను గుర్తించి 1909 ఇండ్లను అధికారులు మంజూరు చేశారు. కానీ 1215 ఇండ్లను నిర్మించేందుకు కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకున్నారు. ఇంకా 694 ఇండ్లకు ఒప్పందం జరగలేదు. నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. గత ఏడాది డిసెంబర్ నాటికి నాలుగేండ్లలో 1103 ఇండ్లను మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 148 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇండ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో దాదాపు 60 నుంచి 70 కుటుంబాలు ఉన్న ఇంటిని, గుడిసెలను కోల్పోయి రోడ్డున పడ్డాయి. పొలం గట్ల దగ్గర గుడిసెలు వేసుకున్నారు. మరి కొంతమంది ఇతర ప్రాంతాలకు వలస పోయారు. ఇండ్ల కోసం ఐదేండ్లుగా కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. కానీ ఇల్లు రాలేదు ఉన్న ఇల్లు పోయింది. గుడిసె పోయింది. లబ్దిదారులకు కేటాయించిన కొన్ని ఇండ్లకు తాళం చెవులు ఇచ్చి హ్యాండ్ ఓవర్ చేయలేదు. చేసిన ఇండ్లకు కనీస సౌకర్యాలు కల్పించలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రారంభోత్సవానికి సీతారామ మూడు పంపులు రెడీ

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సీతారామ ప్రాజెక్టుకు చెందిన మూడు పంప్‌హౌజ్‌లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి యన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ చేతుల మీదుగా ఆగస్ట్ 15న శ్రీకారం చుడతామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సీతారామ ప్రాజెక్టుకు చెందిన మూడు పంప్‌హౌస్‌ల ప్రారంభోత్సవ ఏర్పాట్లతోపాటు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ అనుమతులపై ఆయన శనివారం హైదరాబాద్ సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖా కార్యదర్శి రాహుల్ బొజ్జా, సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ జి అనిల్ కుమార్, డిప్యూటీ ఈఎన్సీ కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పంపుల ప్రారంభోత్సవం రోజున ఖమ్మం జిల్లా వైరాలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు గోదావరి జలాల నుంచి 67 టీఎంసీల కేటాయింపుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణపు పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ప్రాజెక్ట్ నిర్మాణపు అనుమతులు చివరి దశలో ఉన్నాయన్నారు. జీఆర్ఎంబీ త్వరలో అనుమతి ఇవ్వనుందన్నారు. అదే సమయంలో సుప్రీంకోర్టుతో పాటు కేంద్ర పర్యావరణం అటవీ శాఖాల అనుమతులపై దష్టి సారించి సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. అదే సమయంలో కాలువల నిర్మాణంలో అడ్డుగా ఉన్న రైల్వే క్రాసింగ్‌ల వద్ద నిర్మాణం ఆగిపోకుండా ఉండేలా ఆ శాఖతో చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్యాకేజ్ 1, 2లకు సరిపడా భూసేకరణను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఈ రెండు ప్యాకేజీలకు అవసరమయ్యే 3,000 ఎకరాల భూసేకరణ సత్వరమే చేపట్టగలిగితే, నిర్దేశిత లక్ష్యానికి చేరుకోగలుతామని మంత్రి స్పష్టం చేశారు. త్వరితగతిన ఈ ప్రాజెక్టు పూర్తయితే మూడు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు కొత్తగా రెండు లక్షలా 60 వేల ఎకరాల ఆయకట్టు సేద్యంలోకి వస్తుందన్నారు.

కేరళకు ఏఐకేఎస్ రూ. కోటి సహాయం

- కేరళ సీఎం పినరయి విజయన్‌కు అందజేత
- ఆల్ ఇండియా వాయనాడ్ రిలీఫ్ ఫండ్‌కు ఏఐకేఎస్ పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవలి కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరగడంతో జరిగిన విధ్వంసం నుంచి కోలుకునేందుకు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), కేరళ కర్షక సంఘం చేయూత అందించాయి. రూ.కోటి సహాయం అందించాయి. ఈ మేరకు తిరువనంతపురంలోని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఏఐకేఎస్, కేరళ కర్షక సంఘం నేతల బృందం కలిసి రూ. కోటి చెక్కును అందజేసింది. వాయనాడ్ కొండచరియల ఉపశమనం, పునరావాసం కోసం డిస్ట్రెస్ రిలీఫ్ ఫండ్‌ను అందజేసింది. అంతకు ముందే ఏఐకేఎస్ రూ.5 లక్షలు ఇచ్చింది. ఆగస్ట్ 10న ఆల్ ఇండియా వాయనాడ్ రిలీఫ్ ఫండ్‌కు పిలుపునిచ్చింది. అలాగే తమిళనాడు వివాసాయిగల్ సంఘం (ఏఐకేఎస్ అనుబంధం) కూడా వాయనాడ్ రిలీఫ్ ఫండ్‌కి రూ.లక్ష విరాళంగా అందించింది. కేరళ కర్షక సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27,000 కంటే ఎక్కువ ప్రాథమిక యూనిట్ల నుండి రూ. కోటి వసూలు చేసింది.

ఈ సందర్భంగా ఏఐకేఎస్, కేరళ కర్షక సంఘం నేతల బృందం వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రదేశాలను సందర్శించింది. అక్కడి పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకుంది. ఈ బృందంలో ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు ఈపి జయరాజన్, ఆర్థిక కార్యదర్శి పి.కృష్ణప్రసాద్, కేరళ కర్షక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. విజయకుమార్, వల్సన్ పనోలి, ఉపాధ్యక్షులు ఎం. మెహబూబ్, సంయుక్త కార్యదర్శి విఎస్. పద్మకుమార్, కోశాధికారి గోపి కొత్తముురికల్, సికెసి సభ్యుడు కె.కె.రఫేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.ఆర్.సకీనా, పి.శశి, పి.ఎం.ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు

- 120కు పైగా రహదారులు మూసివేత

షిమ్లా : హిమాచల్‌ప్రదేశ్‌లో గత కొన్ని రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 16వ తేదీ వరకూ కూడా రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం హెచ్చరించింది. కాగా, భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డం, ఆకస్మిక వరదలు సంభవించి ర